

విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

## ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రజల మనిషి

### బీఆర్ఎస్ పాలకుర్తి నాయకులు

పాలకుర్తి రూరల్, డిసెంబర్ 4: ఎన్నికల్లో ఓడినా గెలిచినా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రజల మనిషేనని, ప్రజల కోసం నిరంతరం పని చేస్తాడని ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పాలకుర్తి నియోజకవర్గాన్ని దయాకర్‌రావు అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. ఎర్రబెల్లి ఓటమి బాధాకరమన్నారు. ఎర్రబెల్లిపై ప్రజల తీర్పును గౌరవిస్తామని, ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ తప్పు చేయలేదని, ఆరు సార్లు ఎమ్మెల్యేగా ఒకసారి ఎంపీగా గెలిచినా, అవినీతి మచ్చ లేదన్నారు. ఇకపై కూడా కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుంటారని, బీఆర్ఎస్ శ్రేణులు ఓటమికి కుంగి పోవద్దన్నారు. కార్యకర్తలు నాయకులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటారని, ప్రతిపక్ష పాత్రను సమర్థవంతగా నిర్వహిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఈ సమావేశంలో ఎఫ్‌పీసీఎస్ బ్యాంక్ చైర్మన్ బొబ్బల అశోక్‌రెడ్డి, పాలకుర్తి సర్పంచ్ వీరమనేని యాకాంతారావు, మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, జరుపుల బాలూనాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ ముస్కు రాంబాబు, వైస్ చైర్మన్ కారుపోతుల వేణు, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు గుగులోత్ పార్వతి, ముత్తారం సర్పంచ్ కలువల భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



గుట్టపై గండ దీపం వెలిగించి మొక్కు చెల్లిస్తున్న శ్రీధర్‌రావు

## బీఆర్ఎస్ విజయం కోసం దీక్ష పూర్తి

చిల్పూరు, డిసెంబర్ 4 : చిల్పూరు గుట్టపై బీఆర్ఎస్ విజయం కోసం గుట్టపై గండదీపం (అఖండ జ్యోతి) దీక్ష ముగిసింది. మండలంలోని బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు అక్టోబర్ 9 నుంచి డిసెంబర్ 4 వరకు 54 రోజుల పాటు సాగింది. ఎమ్మెల్యేలుగా కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపొందడంతో మొక్కులు చెల్లించినట్లు శ్రీధర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ ప్రతి రోజు గుట్ట పైకి ఎక్కి జ్యోతి వెలిగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పూజారి కృష్ణమాచార్యులు, గాదె శేఖర్, గొల్లపల్లి విష్ణు, బోనగిరి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ -విజయవాడ మార్గంలో రైళ్ల రద్దు

డోర్నకల్, డిసెంబర్ 4: సికింద్రాబాద్ –విజయవాడ మార్గంలో నడిచే పలు రైళ్లను నాన్ ఇంటర్ లాకింగ్ వర్క్ వల్ల రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. గుంటూరు –సికింద్రాబాద్ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ ఈనెల 10 నుంచి 18 వరకు, సికింద్రాబాద్ –విజయవాడ శాతవాహన ఎక్స్‌ప్రెస్ ఈ నెల 7తో పాటు, 10 నుంచి 18 వరకు, సికింద్రాబాద్– భద్రాచలం కాకతీయ ఎక్స్‌ప్రెస్ 6వ తేదీతో పాటు, 10 నుంచి 18 వరకు, ఆదిలాబాద్–తిరుపతి కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఈనెల 5 నుంచి 19 వరకు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. కాజీపేట–డోర్నకల్, డోర్నకల్ – విజయవాడ పుష్‌పుల్ ప్యాసింజర్ రైళ్లను ఈ నెల 10 నుంచి 18 వరకు, కాజీపేట –తిరుపతి, లింగంపల్లి నుంచి కాకినాడ వెళ్లే గౌతమీ ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 10 నుంచి 18 వరకు రద్దు చేశారు. అలాగే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలును ఈనెల 11 నుంచి 19 వరకు కాజీపేట వరకు మాత్రమే నడుస్తుందన్నారు. భద్రాచలం రోడ్డు– బల్లార్షా వెళ్లే సింగరేణి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 6 నుంచి 8 వరకు, 10 నుంచి 19 వరకు హసన్‌పర్తి రోడ్డు వరకు మాత్రమే నడుస్తుందని పేర్కొన్నారు.

## ధాన్యం కేంద్రాన్ని వినియోగించుకోవాలి

నర్సింహులపేట, డిసెంబర్ 4: మండలంలోని వస్రంతండా గ్రామ పంచాయతీ శివారులో దుర్గమ్మ గుడి సమీపంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ వైస్ చైర్మన్ బొబ్బ సంజీవరెడ్డి సోమవారం తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పట్టు నిలుపుకొన్న బీఆర్ఎస్..

- మండలంలో టీడీపీ ఉనికి మాయం
- కాంగ్రెస్ ఓట్లకు గండి
- కార్యకర్తల్లో నూతనోత్సాహం
- కాంగ్రెస్ కోటలో బీఆర్ఎస్ పాగా
- ఫలించిన జడ్పీటీసీ 'గుడి' వ్యూహం

లింగాలఘనపురం, డిసెంబర్ 4 : ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ ఇస్తున్న మండలంలో ఈసారి బీఆర్ఎస్ పట్టు సాధించింది. ఆద్యంతం పోటాపోటీగా కౌంటింగ్‌లో కాంగ్రెస్‌కు దీటుగా బీఆర్ఎస్ నిలిచింది. జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలిచ్చాయి. స్థానిక ప్రజలు ఎప్పుడూ విలక్షణమైన తీర్పు ఇస్తుంటారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఒకలా, స్థానిక సంస్థల ఎన్నికల్లో మరోలా తీర్పు ఇస్తుంటారు. ఇప్పటి వరకూ జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఈ మండలంలో కాంగ్రెస్‌కు 5 నుంచి 6 వేల మెజార్టీ లభిస్తూ వస్తోంది. జనగామ అసెంబ్లీ నుంచి విడిపోయి, స్టేషన్‌ఘన్‌పూర్‌లో విలీనమైనా కాంగ్రెస్‌కే మొగ్గు చూపుతూ వస్తోంది. ఈ క్రమంలో మండలంలోని టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు నీలం భిక్షపతి, మెంతన కిష్టయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గోసంగి కిష్టయ్యతో పాటు క్యాడర్‌ను జడ్పీటీసీ బీఆర్ఎస్‌లో కడియం శ్రీహరి సమక్షంలో చేర్పించారు. మండలంలో నలుగురు కాంగ్రెస్ ఎంపీటీసీల్లో కేమిడి భిక్షపతిని జనగామలో జరిగిన కార్యక్రమంలో సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేర్పించారు. మరో కాంగ్రెస్ సిరిపురం ఎంపీటీసీ బర్ల మాధవీ కుమార్‌ను కడియం సమక్షంలో బీఆర్ఎస్‌లో చేర్పించారు. దీనితో మండలంలో టీడీపీ క్యాడర్ పోయింది. కాంగ్రెస్ పార్టీకి గండి కొట్టినట్లయింది. ఈ క్రమంలో మండలంలో కాంగ్రెస్‌కు కంచుకోటలా ఉన్న గ్రామాల్లో బీఆర్ఎస్ పాగా వేసి మెజార్టీ సాధించింది. నాగారంలో 537 పోలై 211 ఓట్లు, మాణిక్యపురంలో 685కు 221, జీడికల్‌లో 789కు 331, లింగాలఘనపురంలో 1,192 కు 107, నెల్లుట్లలో 1,728 కు142, వడిచర్లలో801కు 22, కొత్తపెల్లి లో475కు 18, నేలపోగులలో 681కు 39 ఓట్లు కాం గ్రెస్ కంటే ఎక్కువగా బీఆర్ఎస్‌కు పోలయ్యాయి. మిగతా గ్రామాలైన కళ్లెంలో 814 ఓట్లు, సిరిపురంలో 489, గుమ్మడవెల్లిలో 520, బండ్లగూడెంలో 306, పటేలుగూడెంలో 531, కుందారంలో 1,308, నవాబుపేటలో 424, చీటూరులో 679 ఓట్లు బీఆర్ఎస్‌కు పడి కాంగ్రెస్‌కు అడ్డు కట్ట వేశాయి. ప్రతీ ఏటా కాంగ్రెస్‌కు 5నుంచి 6 వేల మెజార్టీ ఇస్తున్న ఈ మండలంలో రాష్ట్రమంతా కాంగ్రెస్ ప్రభంజనం సృష్టించినా ఈ మండలం బీఆర్ఎస్‌కు అండగా నిలిచి కడియం శ్రీహరి గెలుపునకు బాటలు వేసింది. మండలంలో బీఆర్ఎస్‌కు 12,646 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 13,062 ఓట్లు పోలయ్యాయి. 5 నుంచి 6 వేల మెజార్టీ సాధించిన ఈ మండలంలో బీఆర్ఎస్ దీటుగా ఉండడంతో కాంగ్రెస్‌కు కేవలం 414 ఓట్ల మెజార్టీయే వచ్చింది. జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి కృషి, నిరంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల శ్రమతో కాంగ్రెస్ విజయానికి అడ్డు పడి కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా గెలవడానికి బాటలు వేసింది.



ప్రచారంలో కడియం శ్రీహరికి స్వాగతం పలుకుతున్న ప్రజలు (ఫైల్)

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా క్రీడాకారులు

జనగామ చౌరస్తా, డిసెంబర్ 4 : నిజామాబాద్ జిల్లా భూసాపూర్‌లో డిసెంబర్ 4 నుంచి 6 వరకు జరుగనున్నాయి. రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళా కబడ్డీ పోటీల్లో జనగామ జిల్లా క్రీడాకారులు ఆడనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోటకూరి గట్టయ్య, జిల్లా చైర్మన్ వై కుమార్ గౌడ్, అధ్యక్షుడు పోగుల సారంగపాణి సోమవారం సంయుక్తంగా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కబడ్డీ జిల్లా జట్టుకు ధనుష కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.



జిల్లా సీనియర్ మహిళా కబడ్డీ జట్టుతో అసోసియేషన్ బాధ్యులు



స్టేషన్ ఘన్‌పూర్ : కడియంకు శుభాకాంక్షలు తెలుపుతున్న జడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి



స్టేషన్ ఘన్‌పూర్‌లో సంబురాలు జరుపుకొంటున్న బీఆర్ఎస్ శ్రేణులు

# కడియం శ్రీహరికి శుభాకాంక్షల వెల్లువ

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 4: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం బీఆర్ఎస్ నాయకులు కడియం శ్రీహరిని అభినందించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, ఏనుగు రాకేశ్‌రెడ్డి, నాయకులు నరేందర్ రెడ్డి, బెలిదె వెంకన్న, మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్, జడ్పీటీసీలు ఇల్లందుల బేబీ శ్రీనివాస్, చాడ సరిత, మార్కెట్ వైస్ చైర్మన్ చందర్‌రెడ్డి, సర్పంచ్‌లు పోగుల సారంగపాణి, తాటికొండ సురేశ్‌కుమార్, గాదె చంద్రయ్య, బూర్ల శంకర్, గుర్రం రాజు, నెలమంచి అజయ్ రెడ్డి, తోట సత్యం, రాపోలు మధుసూదన్‌రెడ్డి, నగరబోయిన యాదగిరితో పాటు వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో శ్రీహరికి పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. ఆదివారం కడియం గెలుపు ప్రకటన రాగానే వివిధ గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు పటాకులు కాల్చి, గులాబీ రంగు చల్లుకుని సంబురాలు జరుపుకున్నారు.

### జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్ : స్టేషన్ ఘన్‌పూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని బీఆర్ఎస్ మండల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హనుమకొండలోని కడియం నివాసంలో సోమవారం మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. కడియం శ్రీహరిని కలిసిన వారి లో ఎంపీపీ రడపాక సుదర్శన్, తమ్మడపల్లి(ఐ) సర్పంచ్ గాదెపాక అనిత, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గాదెపాక సుధాకర్‌బాబు, పీఏసీఎస్ డైరెక్టర్ కొత్త సాంబరాజు, ఉప సర్పంచ్ రవికుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



స్టేషన్ ఘన్‌పూర్ : తానేదార్‌పల్లిలో సంబురాలు జరుపుకొంటున్న బీఆర్ఎస్ శ్రేణులు



జఫర్‌గఢ్ : శ్రీహరికి పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న ఎంపీపీ, సర్పంచ్‌లు